www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 జూన్ 2024
5
తూర్పుగోదావరి

సారాను అరికట్టాలని మహిళల వినతి

ప్రజాశక్తి - సీతానగరం

నాటుసారాను అరికట్టాలంటూ రఘుదేవపురం గ్రామానికి చెందిన మహిళలు బుధవారం పోలీసులకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మండలంలో మారుమూల పల్లెల్లోనూ నాటు సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ నాటుసారా రక్కసికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. నాటు సారా వల్లా తమ కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సారా అమ్మకాలు పెరగడంతో తయారీ దారులు కల్తీ సారా తయారు చేసి విక్రయించేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని తాగుతున్న మందుబాబుల అనారోగ్యాలకు గురవుతున్నాన్నారు. తమిళనాడు తరహా ఘోరం జరక్క ముందే సారాకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

ధాన్యం సొమ్ముల కోసం ఎదురుచూపు

రైతులకు రూ. 202 కోట్ల బకాయిలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ధాన్యం సొమ్ముకోసం రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రూ.202 కోట్ల మేర బకాయిలు నిలిచిపోయాయి. గత రబీ సీజన్లో 1.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారు 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని అంచనా. జిల్లాలోని 365 రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులు ధాన్యం విక్రయించే అవకాశాన్ని కల్పించారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం తీసుకోగా 2.28 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం రూ.202 కోట్ల ధాన్యం బకాయిలు నిలిచిపోయాయి. రబీ సాగు తుది సాగులో సాగు నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ధాన్యం కొనుగోలుపై అధికార యంత్రాంగం చొరవ లోపించింది. ఈ నేపధ్యంలో ధాన్యం కొనుగోలు, ఆపై చెల్లింపులు మొత్తంగా ప్రహసనంలా మారాయి. తాజాగా జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. గత పంట బకాయిలు రాకపోవడంతో సాగు పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రహసనంలా ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రహసనంలా మారిందని అధికారుల గణాంకాలే చెబుతున్నాయి. సుమారు లక్ష మంది రైతులు 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని అంచనా. ప్రభుత్వం కేవలం 23,081 మంది రైతుల నుంచి 2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలుకు మొత్తం రూ.498.64 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.296 కోట్లు మాత్రమే చెల్లించారు. సుమారు ఐదు వేలకుపైగా రైతులు రూ.202.33 కోట్ల బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. రైతు బజార్లలో సాంకేతిక సమస్యలు, గన్ని బ్యాగుల కొరత వంటి కారణాలతో ప్రభుత్వ మద్దతు ధరకు రూ.200 తక్కువగా వ్యాపారులకు విక్రయించినట్లు రైతులు చెబుతున్నారు.





బకాయిల కోసం ఎదురుచూపులు

జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల మంది రైతులు ధాన్యం బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. అదనులో పంట వేయకపోతే దిగుబడిపై ప్రభావం కనిపించే పరిస్థితులు ఉన్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో చివరి దశలో గోదావరి వరదలు, అధిక వర్షాల కారణంగా పంట చేలల్లో నీరు నిలిచి రైతులు నష్టపోయారు. ఈ ఏడాది కూడా తిరిగి ఆనాటి పరిస్థితులే తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ముందస్తు సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. గత పంట బకాయిలు ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో ప్రైవేట్ అప్పులను ఆశ్రయిస్తున్నారు. పంటల ప్రారంభ దశలోనే ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం సకాలంలో తనకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సొమ్ములు చెల్లించేలా చర్యలు

జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ము చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాము. జిల్లావ్యాప్తంగా 23,081 మంది రైతుల నుంచి 2.28 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాము. రూ.498.64 కోట్లకు గానూ ఇప్పటి వరకూ 296.31 కోట్లు చెల్లింపులు జరిగాయి. రూ.202.33 కోట్ల బకాయిలు ఉన్నాయి.

- రాధిక, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్

రైతు బజార్లలో రూ.50కే కిలో టమాటా

ఇన్‌ఛార్జి కలెక్టర్ తేజ్‌భరత్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

రైతు బజార్ల ద్వారా కిలో టమోటా రూ.50లకే విక్రయిస్తున్నట్టు ఇన్‌ఛార్జి కలెక్టర్ తేజ్‌భరత్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న రైతు బజారులో సబ్సిడీ ద్వారా టమోటా అమ్మకాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కూరగాయల ధరలు పెరుగుదలపై రెండు రోజుల క్రితం సమన్వయ శాఖల అధికారులతో సమావేశం అయ్యామన్నారు. టమోటా కిలో రూ.70, ఉల్లిపాయలు కిలో.40 చేరిన నేపథ్యంలో ధరల నియంత్రణపై మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగా "పుంగనూరు" నుంచి ఐదు మెట్రిక్ టన్నుల టమాటా జిల్లాకు దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు. గ్రేడ్ వన్ రకం టమాటా కేజీ ఒక్కంటికి రూ.50 లు చొప్పున ప్రతీ కుటుంబానికి రెండు కిలోల చొప్పున అమ్మకాలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ఆరు రైతు బజార్లలో వీటి విక్రయాలు జరుపుతున్నామన్నారు. నగరంలోని ఐదు, కొవ్వూరు లోని ఒక రైతు బజారులో సబ్సిడీ టమోటాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి రెండూ రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షించి సరఫరా చేసే ప్రాంతాలను గుర్తించి అక్కడ నుంచి ఆమేరకు సరుకును తీసుకుని రానున్నట్లు తెలిపారు. తద్వారా లభ్యత పెరగడం వలన రానున్న రోజుల్లో ధరలను నియంత్రణ చేయడం సాధ్యమవుతుందన్నారు. ఆయన వెంట మార్కెటింగ్ శాఖ ఎడి ఎం.సునీల్ కుమార్, రైతు బజారు ఎస్టేట్ అధికారులు, రైతులు, వినియోగదారులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా : మద్దిపాటి

ప్రజాశక్తి - గోపాలపురం

నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. బుధవారం గోపాలపురం ఎంపిడిఒ సమావేశం హాలల్లో ఎంపిపి రొంగల సత్యనారాయణ, ఎంపిడిఒ రమేష్ అధ్యక్షతన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్ర అభివద్ధికి, నీటిపారుదల ప్రాజెక్టులు, రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. గోపాలపురం నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సత్యసాయి మంచినీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వేతన బకాయిలు ఇప్పించాలని ఎంఎల్‌కు వినతిపత్రం అందించారు. అలాగే బ్లడ్ కాన్సర్‌తో బాధపడుతున్న తమ కుమారునికి వైద్యం అందించాలిన శ్రీను, విజయ దంపతులు ఎంఎల్ఎకు మొరపెట్టుకున్నారు. దీనిపై ఎంఎల్ఎ స్పందించారు. బాలుడి వైద్యానికి సాయం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ వనజాక్షి, సిఐ బాల సురేష్‌బాబు, టిడిపి నాయకులు వై.మంగారావు, వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీకి సర్వం సిద్ధం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీకి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి తెలిపారు. జిల్లా మొత్తం మీద వివిధ కేటగిరిల కింద మొత్తం 18 రకాల పెన్షన్‌లు అందచేస్తున్నట్లు తెలిపారు. వృధ్యాప్య, వితంతు, ఒంటరిమహిళ, వీవర్స్ కల్లుగీత కార్మికులు, ఫిషర్ మాన్, కోబ్లేర్స్, ట్రాన్స్ జెండర్, హెచ్ఐవి, డప్పు కళాకారులకు పెంచిన పింఛను జూలై 1న అందిస్తామన్నారు. వికలాంగులు, లెప్రసీ బాధితులకు రూ.3వేల నుంచి రూ.6వేలు, పూర్తి డిజేబులిటి, మస్కిలర్ జిస్ట్రోఫీ, పెరాలసిస్ (వీల్ చైర్, బెడ్ రిడేన్) పెన్షనర్లకు రూ.5వేల నుంచి రూ.15వేలు పెంచారన్నారు. కిడ్నీ, లివర్, హార్ట్ ట్రాన్స్‌ప్లంటేషన్, డయాల్సిస్ బాధితులకు రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు జిల్లాలో మొత్తం 2,44,302 మందికి రూ..165.13 కోట్లు మంజూరయ్యాయన్నారు. జూలై 1వ తేది నుంచి ప్రజాప్రతినిధుల సమక్షంలో వీటిని పంపిణీ చేస్తామన్నారు. సచివాలయం సిబ్బంది ఇంటింటికీ వచ్చి పింఛను పంపిణీ చేస్తారన్నారు.

జిఒ 117ను తక్షణం రద్దు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్య, ఉపాధ్యాయ రంగాన్ని విచ్ఛన్నం చేస్తూ గ్రామీణ విద్యార్థుల పాలిటి శాపంగా మారిన 117 జొను వెంటనే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏమాత్రం అవగాహన లేకుండా విద్య రంగాన్నే విచ్ఛిన్నం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీకి కట్టుబడి 117 జిఒను రద్దుచేయాలన్నారు. ఆయన వెంట ఎంపిటిఎఫ్ మండల అధ్యక్షులు రఘువీరశాస్త్రి, ప్రధాన కార్యదర్శి శంకరం, కార్యదర్శి విజయకుమార్‌రాజు, సభ్యులు జి.కృష్ణ, జి.రాజారత్నం, నాని తదితరులు ఉన్నారు.

బ్యాగులు, పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు విద్యార్థులకు ప్రభుత్వం సరఫరాచేసిన పుస్తకాలు బ్యాగ్ లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటుందని విద్యా స్థాయిలో హైస్కూల్ విద్య విద్యార్థుల భవిష్యత్తు కు ఎంతో కీలకమైందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ ఎం పి వీర్రాజు టిడీపీ నాయకులు ఆళ్ళ హరిశ్చంద్ర ప్రసాద్ నాదెళ్ళ నాని విద్యకమిటీ ఛైర్మన్ భగవాన్ ఎంపిపి మట్టా వీరాస్వామి ఎంపిటిసీ ఎస్ అర్జనరావు ఎన్డీఏ కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఎనీమియా ముక్తి భారత్ అమలుపై పరిశీలన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో ఎనీమియా ముక్తి భారత్ అమలుపై కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. అనంతరం బృందం సభ్యులు జితేంద్ర సింగ్, ఎస్.పూజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఎనీమియా ముక్తి భారత్ పనితీరును వివరించారు. కేంద్ర బంద సభ్యులు పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎనీమియా ముక్తి భారత్ కార్యక్రమం అమలుపై పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బెండిక్ట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాలచర్లలో ఉన్న ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. సాటిలైట్ సిటీ- 3లో విలేజ్ హెల్త్ క్లినిక్స్, అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. రక్తహీనతను పూర్తిగా అరికట్టడానికి చిన్నపిల్లలకు, కౌమార దశలో ఉన్న పిల్లలకు, గర్భిణులకు తగిన విధంగా ఐఎఫ్ఎ మందులను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి డాక్టర్ ఎన్.రాజకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మౌనిక, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్రప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా సాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం నియోజకవర్గంలో రైతులకు సక్రమంగా సాగునీరు అందించడమే లక్ష్యమని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం గాదరాడ పుష్కర కాలువ, రామచంద్రపురంలో తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ కాలువ, సింగవరం కొండ నుంఇ మొదలై చినకొండేపూడి వెళ్లే కాలువ, శ్రీరంగపట్నం బురద కాలువల పూడిక తీత పనులను అధికారులు ప్రారంభించారు. వీటిని ఆయన పరిశీలించారు. ఆయన వెంట నాయకులు మద్దాల ఏసుపాదం, కారిచర్ల విజయశంకర్, డొల్ల సుబ్రహ్మణ్యం, సింగవరం లింగరాజు, మట్టా వెంకటేశ్వరరావు, కాండ్రేగుల పోసిరత్నం, కోనే శ్రీను, నాగారపు సత్తిబాబు, బొబ్బిరెడ్డి సూరిబాబు ఉన్నారు.

'శ్రీ సత్యసాయి' కార్మికుల నూతన కార్యవర్గం ఎన్నిక

సీతానగరం : పురుషోత్తపట్నంలోని శ్రీ సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సంఘం నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది.కార్యవర్గంలో ఏడుగురు సభ్యుల పదవీ కాలం ముగియడంతో వారు రాజీనామా చేశారు. వారి స్థానంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా కట్టమూరి వీరబాబు, జనరల్ సెక్రటరీగా ఉందుర్తి ఇస్సాకు ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ కార్మికులకు అండగా ఉంటామన్నారు.

జూనియర్ ఇంటర్‌లో తిరుమల ప్రభంజనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల జూనియర్ కాలేజ్ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపిసి విభాగంలో 470కి 468 మార్కులు ముగ్గురు విద్యార్థులు ఎం.ప్రియహాసిని, సిహెచ్.హాసిని, కె.షర్మిళసాయి సాధించారాన్నరు. 466 మార్కులుపైన 76 మంది, 465 మార్కులుపైన 231 మంది, 463 మార్కులు పైన 693 మంది, 460 పైన 1,168 మంది, 450 పైన 1,970 మంది సాధించారన్నారు. బైపిసి విభాగంలో షేక్ ఫాతిమున్నీసా బేగం 440కి 438 మార్కులు, ఎ.సింగ్ ఎ.సింగ్, ఎన్.మణి, కెఎన్.హవీల 437 మార్కులు సాధించారన్నారు. 435 పైన 39 మంది, 430 పైన 172 మంది, 400 పైగా మార్కులు 332 మంది సాధించారన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమల రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసిని అభివృద్ధి చేస్తాం : ఎంఎల్ఎ మద్దిపాటి

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఎఎంసిని అభివృద్ధి చేసి రైతులకు అండగా నిలబడతామని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. బుధవారం ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులో సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎఎంసి ఛైర్మన్ ముళ్లపూడి వెంకట్రావు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి, బిజెపితో పాటు జనసేన పార్టీ నాయకులతో కలిసి ప్రతి విషయంలో ముందుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తగినంత గుర్తింపు ఇవ్వాలని ఆయన సూచించారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, నాయకులు వై.మంగారావు, జి.మురళి, ఎన్.సత్యనారాయణ, వి.రమేష్, జ్యేష్ఠ శ్రీనివాసరావు, రాజబాబు, సర్పంచ్ దాకే గంగారాణి, కాట్రగడ్డ సురేష్, కాండ్రేగుల మోహన్ చౌదరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామ తులసి, పోసిన గణపతి ఉన్నారు.

కార్టూ'నిజం'



మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని న్యాయమూర్తి కె.ప్రకాష్‌బాబు యువతకు సూచించారు. బుధవారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. తాత్కాలిక ఆనందం కోసం మాదకద్రవ్యాలను వాడటం వల్ల అనేక రుగ్మతలకు గురవుతారని వివరించారు. మాదక ద్రవ్యాలను కలిగి ఉండడం, సేవించడం, సరఫరా చేయడం, తయారీ, అమ్మకాలు అన్నీ క్రిమినల్ నేరాలుగా పరిగణిస్తాం న్నారు. వీటికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి నేరాలలో పట్టుబడితే భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. కాబట్టి అందరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ సదస్సులో అడిషనల్ ఎస్పి వి.సోమశేఖర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో అవగాహనా ర్యాలీ

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షతన కళాశాల యూత్ రెడ్ క్రాస్ మరియు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాద కద్రవ్యాల దుర్వినియోగ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపల్ కెవిఎస్ రత్నకుమార్ నిర్వహణలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిఎస్‌పి అంబికా ప్రసాద్, సిఐ పుల్లారావు, సీనియర్ డాక్టర్ సూర్య ప్రకాష్, డాక్టర్ కెవి.రమణ, డాక్టర్ జిఎన్ బిబిఎస్ మహాలక్ష్మి, డిస్టిక్ కో-ఆర్డినేటర్ వై.ప్రకాష్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ విబిటి సుందరి ఎన్ఎస్ఎస్ అధికారినిలు ఎం.కాస్మ, విజయలక్ష్మి, శ్రావణి, ప్రసన్న, కె.చిన్నిబాబు వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించి, విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు మరింత కృషి చేయాలని డిఎస్ఇఒ కె.వాసుదేవరావు సూచించారు. గోపాలపురం మండలం విద్యాశాఖ అధికారులతో, ఉపాధ్యాయులతో స్థానిక హై స్కూల్లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. ప్రతీ విద్యార్థిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. నేటి కాలానికనుగుణంగా సాంకేత పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో ప్రణాళిక పద్ధతిలో విద్య బోధన అందించి మంచి ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు.

ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలను అమ్మితే చర్యలు తీసుకంటామన్నారు. స్టేట్ సిలబస్‌తో కూడిన టెక్స్ట్ పుస్తకాలు ప్రభుత్వం వద్ద కొనుగోలు చేయాలన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలకు కావలసిన స్టాక్ ఇన్‌డెంట్‌ను సమర్పించి ముందుగా ఐదు శాతం డబ్బులు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. తొలుత ఆయన మిడ్డేమీల్స్‌ను, తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు, తిరుమల దాస్, హెచ్‌ఎం సోమశేఖర్, సిఆర్‌పి నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొనారు.

'పుల్లా' కుటుంబానికి పరామర్శ

కడియం : మాతృ వియోగంతో బాధపడుతున్న మండలంలోని కడియపులంక గ్రామ మాజీ సర్పంచ్ పుల్లా రామారావు కుటుంబాన్ని మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం పరామర్శించారు. రామారావు సోదరులను ఓదార్చి ప్రగడ సానుభూతిని తెలియజేసారు. తొలుత పుల్లా మాణిక్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుల్లా కుటుంబ కడియపులంక గ్రామ అభివృద్ధికి ఎంతగానో కషి చేసిందన్నారు. వారి వెంట పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

టీచర్స్ డైరీ ఆవిష్కరణ

కడియం : మండలంలోని దుళ్ల జెడ్‌పి హై స్కూల్ ఆవరణలో యుటిఎఫ్ కడియం మండల శాఖ ఆధ్వర్యంలో విజయ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ (రాజమహేంద్రవరం) వారు సమాకూర్చిన టీచర్స్ డైరీని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి బుధవారం ఆవిష్కరించారు. అలాగే దామిరెడ్డిపల్లి-1 పాఠశాల హెచ్‌ఎం మాణిక్యంసత్యవెంకట నాగేశ్వరరావు సమాకూర్చిన సిఎల్ బుక్స్‌ను గోరంట్ల ఆవిష్కరించారు. తొలుత హైస్కూల్లో 'వాష్' సంస్థ ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించనున్న వంటసాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, అధికారులు, యుటిఎఫ్ నాయకులు, వాష్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

నిడదవోలు : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం వెంపగ్రామంలో దళితులపై దాడికి పాల్పడి. మహిళపై అత్యాచారానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కెవిపిఎస్ నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో ఆధిపత్య కులాలకు చెందిన వారు చిన్నపాటి వాగ్వాదాన్ని ఆసరా చేసుకొని 70మంది యువకులు అర్ధరాత్రి, కర్రలు, రాడ్లతో దళిత పేటపై దాడికి పాల్పడటం దారుణమన్నారు. ఒక దళిత మహిళ ఇంట్లోకి చొరబడి అత్యాచార యత్నం చేయడం, రోడ్ పై ఉన్న వాహనాలు ధ్వంసం చేయడం అమానుషమన్నారు. సమయానికి పోలీసులు రాకపోతే చాలా దారుణం జరిగేదని రాంబాబు అన్నారు నిందితులను కఠినంగా శిక్షించాలని రాంబాబు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కె.అశోక్, ఎం.ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా నియోజకవర్గం అభివృద్ధి

చాగల్లు : అధికారులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. చాగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆయనకు ఎంపిపి మట్టా వీరాస్వామి, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ ముప్పిడి మాట్లాడారు. ప్రభుత్వ ఆలోచనా విధానాలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఎంఎల్ఎను అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాతి బుజ్జి, తహాశీల్దార్ ఎం.సావిత్రి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం

చాగల్లు : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఎంపిపి మట్టా వీరాస్వామి అధ్యక్షతన జరిగిన మండల అధికారులు, ప్రజాప్రతినిధుల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావును వివిధ శాఖల అధికారులు ఘనంగా సత్కరించారు. టిడిపి నాయకులు ఆళ్ల హరిశ్చంద్రప్రసాద్, ఎన్.నాని, ఎంపిడిఒ నాతి బుజ్జి, తహాశీల్దార్ ఎం.సావిత్రి తదితరులు పాల్గొన్నారు

'కళ్యాణ మిత్రలను ఆదుకుంటాం'

నల్లజర్ల : కళ్యాణ మిత్రలను ఆదుకుంటామని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు హామీ ఇచ్చారు. నల్లజర్లలో కళ్యాణమిత్రలు బుధవారం ఎంఎల్ఎను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు షేక్ ముని, మాట్లాడుతూ. 2014 నుంచి 2019 వరకు టిడిపి హయంలో పెళ్లికానుకలు అమలయ్యాయన్నారు. వైసిపి హయాంలో అవి నిలిచిపోయాయన్నారు. తమను కొనసాగించాలని కోరారు. త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని ఎంఎల్ఎ వారికి హామీ ఇచ్చారు.

యాజమాన్య తీరుపై కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం వాకలపూడిలో గల ఎఎం గ్రీన్ అమోనియా సంస్థ యాజమాన్య పనితీరును నిరసిస్తూ బుధవారం రాత్రి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. వివరాలలోకి వెళితే...కాకినాడలో ప్రముఖ పారిశ్రామిక సంస్థ నాగార్జున ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ యాజమాన్యం మార్పుతో ఎఎం గ్రీన్ అమోనియా సంస్థగా మారింది. ఈ మార్పు సమయంలో ఫ్యాక్టరీలో పని చేసే కార్మికులను యథావిధిగా వాళ్ల పనులు వాళ్ళు చేసుకోవచ్చని ఎఎం గ్రీన్ అమోనియా యాజమాన్యం తెలిపింది. అయితే ప్రస్తుతం కార్మికులంతా రాజీనామా చేసి. తామిచ్చిన అప్లికేషన్స్ ఫిల్ చేసి ఎఎం గ్రీన్ అమ్మోనియా కంపెనీ కార్మికులుగా జాయిన్ కావాలని సంస్థ యాజమాన్యం ప్రకటించింది. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌తో యాజమాన్యం కార్మికులు ఇప్పటికే రెండు దఫాలుగా చర్చలు జరిపారు. మూడో దఫాగా జూలై 25న చర్చలు జరిగే వరకు ఎటువంటి చర్యలు తీసుకోవద్దని యాజమాన్యానికి జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆదేశించారు. అయినా యాజమాన్యం పట్టించుకోకుండా కార్మికులపై ఒత్తిడి తీసుకురావడంతో బుధవారం కార్మికులంతా ఫ్యాక్టరీ మొదటి గేటు వద్ద ఆందోళన చేపట్టారు.

కంపెనీ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

సాహు మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా సాహు మహారాజ్ జయంతి

ప్రజాశక్తి - జగ్గంపేట

భారతదేశ రిజర్వేషన్ పితామహుడు, ప్రజాస్వామ్యవాది, ఆధునిక విప్లవకారుడు ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి ఘనంగా జరిగింది. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద బహుజన సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జుత్తుక నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్హాపూర్ రాష్ట్రాన్ని 1900-1922 మహారాజుగా పరిపాలించారని తెలిపారు. ఆయన పరిపాలనలో ప్రజలందరూ సమానత్వం, స్వేచ్ఛ కలిసి జీవించేలా పాలన సాగించారని గుర్తు చేశారు. దళిత, బహుజన వర్గాల వెనుకబాటుతనానికి ఆర్థిక, విద్య, వ్యవసాయ రంగాలే అని గుర్తించి వారి కొరకు ప్రత్యేక పాఠశాలలు, హాస్టల్స్, విద్యా సొసైటీలను, గ్రంథాలయాలను స్థాపించారని అన్నారు. వెట్టిచాకిరి, బాల్య వివాహాలు, దేవదాసీ వ్యవస్థలను రద్దు చేశారని, కులాంతర వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు విదేశీ విద్య, ముక్ నాయక్ పత్రికకు ఆర్థిక సాయాన్ని అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్, న్యాయవాది గొడుగు ఆంజనేయులు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సాదే నరేంద్రబాబు, మాల మహానాడు నాయకులు సతీష్, కొండబాబు, కడారి శివ పాల్గొన్నారు.

అతిసారపై విస్తృత ప్రచారం అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట

జిల్లావ్యాప్తంగా ప్రబలుతున్న అతిసార (డయేరియా) వ్యాధిపై గ్రామస్థాయిల్లో విస్తృత ప్రచారం అవసరమని డిఆర్‌డిఎ పీడీ శ్రీ రమణి అన్నారు. బుధవారం సామర్లకోట టిటిడిసిలో 15వ జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పులతో అతిసార కేసులు నమోదు అవుతున్నాయని అన్నారు. వేట్లపాలెం గ్రామంలో అతిసారతో ఒక మహిళ మృతి చెందిన పరిస్థితుల్లో అన్ని మండలాలు, గ్రామ సమఖ్యల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తాగు నీటి కాలుష్యం కారణంగా ప్రజలు వాంతులు, విరోచనాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దానిని నివారించేందుకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహార పదార్ధాలపై మూతలు ఉంచి వేడిగా ఉండగానే భుజించేలా అవగాహన కల్పించాలన్నారు. పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడటం ద్వారా అతిసార వ్యాధి రాకుండా జాగ్రత్త పడవచ్చునన్నారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల, మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు, డిఆర్‌డిఎ డిపిఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సమీక్ష

ప్రజాశక్తి - పెరవలి

తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న దీపిక కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో గురువారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారని ఎంపిడిఒ కె.ఉమామహేశ్వరి తెలిపారు. సమావేశంలో మధ్యాహ్నం 2.30 జరుగుతుందని, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆమె సూచించారు.

మంత్రిని కలిసిన ఫణీంద్ర

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు ఎంఎల్ఎ, మంత్రి కందుల దుర్గేష్‌ను వైసిపి నాయకులు, పట్టణ మాజీ అధ్యక్షులు మద్దిపాటి ఫణీంద్ర, జడ్‌పిటిసి మాజీ సభ్యుడు ముప్పిడి నాగేశ్వరరావు, వైసిపి టౌన్ ప్రెసిడెంట్ ముంగండి కృపానందం, టౌన్ జాయింట్ సెక్రెటరీ కొయ్య సుభాష్ చంద్రబోస్, కొర్లపాటి ప్రసాద్, పడాల సతీష్, కె.మెహర్ తదితరులు బుధవారం కలిశారు. తదరుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

కుండలేశ్వరంలో క్షుద్రపూజల కలకలం

ప్రజాశక్తి -కాట్రేనికోన

మండల పరిధిలోని కుండలేశ్వరం నక్కావారి పేట గ్రామంలో ఒక ఇంటిలో క్షుద్ర పూజలు చేస్తున్నారన్న సమాచారం కలకలం రేపింది. నక్కావారి పేటలో ఒక ఇంటిలో సుమారు 20 మంది యువకులు వచ్చి రాత్రివేళలో పూజలు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి వారి అరుపులు, కేకలతో స్థానికులు హడలిపోతున్నారు. సుమారు నెలరోజుల క్రితం నుంచి ఈ గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ప్రతిరోజూ అర్ధరాత్రి వేళలో కుండలేశ్వరం స్నానఘట్టం వద్దకు వచ్చి శ్మశానంలో పూజలు నిర్వహించడం చూస్తున్నామని స్థానికులు అంటున్నారు. బహిర్భూమికి వెళ్లే సమయంలో చాలాసార్లు వారు తారసపడినా, భయంతో వారిని నిలువరించలేకపోయామని తెలిపారు. ఇతరుల ద్వారా విషయం గ్రహించామని ఈ విషయం మరి కొంతమందికి తెలియజేసినప్పటికీ నిర్లక్ష్యం వహించారని కొంతమంది యువకులు తెలిపారు. ఆ ఇంటిలో ఉన్న మహిళలను వారి బంధువులు ఇంటికి పంపి వేశారని, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన కొందరు యువకులు రాత్రి వేళలో ఒంటికి పసుపు రాసుకుని దిగంబరంగా పూజలు చేస్తూ అర్ధరాత్రి దాటిన తర్వాత కొత్తలంక గ్రామ సమీపంలో గోదావరి ఒడ్డున పూజలు నిర్వహించి ముగ్గులు వేసి నిమ్మకాయలు పెట్టి అన్నం, పసుపు కుంకుమ వేయటం చూసిన కొందరు ఆ ప్రాంతానికి వెళ్ళటం మానేశారు. గుప్త నిధులు, అతీంద్రియ శక్తులు కొరకు ఇటువంటి పూజలు చేస్తారని, అతీంద్రియ శక్తులను పొందినవారు వాటిని ఎవరొకరిపైన ప్రయోగిస్తారని, తమ గ్రామంలో ఎవరిపైనన్నా ప్రయోగించే అవకాశం ఉందని గ్రామస్థులుమంగళవారం కాట్రేనికోన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే స్పందించి క్షుద్రపూజల నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించాలని కోరుతున్నారు. పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని తెలిసింది.

జగన్‌కు ప్రతిపక్ష హోదా ఉండదు

యనమలకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్‌బాబు

ప్రజాశక్తి - కోటనందూరు

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా ఉండదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల కృష్ణుడు స్పష్టం చేశారు. బుధవారం ఆయన తుని నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్‌బాబును టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం తునిలోని అశోక బాబు నివాసానికి ఆయన వెళ్లారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి యనమల దివ్య విజయానికి సహకరించినందుకు అశోక్ బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ ఇనుగంటి సత్యనారాయణను యనమల పరామర్శించారు. అలాగే మాజీ హోంమంత్రి, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప బుధవారం మండలంలోని తేటగుంట టిడిపి కార్యాలయంలో యనమల రామకృష్టుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ఏరకంగా మేలు చేయాలనే ఆలోచనతోనూ ముందుకు సాగుతామన్నారు. జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా కల్పించేది లేదని స్పష్టం చేశారు. చట్టసభల నిబంధన ప్రకారం ప్రతిపక్షానికి 10 శాతం సభ్యులైన ఉండాలన్నారు. లేకపోతే ప్రతిపక్ష హోదా ఉండదని ఆయన అన్నారు.

సామర్లకోటలో అతిసార జాడలు

ప్రజాశక్తి - సామర్లకోట


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సామర్లకోట పట్టణంలో అతిసార వ్యాధి వ్యాపించింది. బుధవారం పట్టణానికి చెందిన పలువురు వాంతులు, విరోచనాలు వంటి అతిసార లక్షణాలతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి రావడంతో వైద్యులు చికిత్స అందించారు. పట్టణానికి చెందిన బ్రౌన్‌పేట, కుమ్మరి వీధి తదితర ప్రాంతాలకు చెందిన వారికి వ్యాధి వచ్చిందని వైద్యులు స్పష్టం చేశారు. అయితే భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పి.అమల తెలిపారు. వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా సీజనల్ వ్యాధులు వస్తాయని, ఆ ప్రకారంగానే పట్టణంలో వ్యాధికి సంబంధించి కేసులు నమోదు అయినట్లు వివరించారు. ఈ వ్యాధి వల్ల భయపడాల్సిన అవసరం లేదన్నారు.

జొన్నలదొడ్డిలో కొనసాగుతున్న వైద్య శిబిరం

మండలానికి చెందిన వేట్లపాలెం శివారు జొన్నలదొడ్డి ప్రాంతంలో ప్రబలిన అతిసార వ్యాధి పూర్తిగా అదుపులోకి రాకపోవడంతో వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. బుధవారం వాంతులు, విరోచనాలతో ఒక కేసు నమోదైనట్లు వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వై.హేమావతి, డాక్టర్ ఎం.పార్ధేష్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన అడిషనల్ డిఆర్ఎం

ప్రజాశక్తి - సామర్లకోట

స్టేషన్‌నుతనిఖీ చేస్తున్న ఎ డిఆర్ఎం

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ కె.శ్రీనివాసరావు, సీనియర్ డివిజనల్ సేఫ్టీ అధికారి ప్రశాంత్‌కుమార్ బుధవారం తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. తనిఖీల అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ప్రయాణికులు, రైళ్ల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీలలో స్టేషన్ మేనేజర్ రమేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.గిరి, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్ వాల్స్ కుండీల్లో జంతువుల వ్యర్థాలు

ప్రజాశక్తి - కరప

వాల్‌ను పరిశీలిస్తున్న జనసేన శ్రేణులు

కరప చివరి ప్రాంతం పేపకాయలపాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్‌తోపాటు, ఇంటింటికీ నీటిని సరఫరా చేసే పైపు లైన్లకు ఉన్న గేట్ వాల్, ఎయిర్ వాల్ వద్ద నిర్మించిన కుండీల వద్ద మృతి చెందిన జంతువుల వ్యర్థాలు ఉన్నాయి. బుధవారం జనసేన పార్టీ నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా హెయిర్ వాల్స్ కుండీల్లో జంతువుల వ్యర్థాలను వారు గమనించారు. దీంతో వారు పంచాయతీ, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆ ప్రాంతానికి చేరుకుని హెయిర్ వాల్ కుండీల వద్ద ఉన్న జంతువుల వ్యర్థాలను తొలగించారు. ఇదే అంశాన్ని వారు ఎంఎల్ఎ పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట

వర్షాకాలంలో వచ్చే సీజన్లో వ్యాధులపై తగు జాగ్రత్తలు అవసరమని ఎంఇఒ-2 పి.పుల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని వేట్లపాలెం జడ్‌పి హైస్కూల్లో అమలౌతున్న మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును ఆయన తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అమలులో రాజీ పడకుండా విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలని కోరారు అలాగే నాడు-నేడు పనులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను, మధ్యాహ్నం భోజనం తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో స్కూల్ హెచ్ఎం పి.అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు ఎస్ఐపై ఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి - కాకినాడ

ఒక రోడ్డు ప్రమాదం కేసులో తాము తీవ్ర గాయాలపాలై సుమారు నెల రోజులకు పైగా ఆసుపత్రిలో ఉన్న సరే గొల్లప్రోలు ఎస్ఐ నిందితులకు సహకరిస్తూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. కరప మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన మందాల తాతయ్య బుధవారం ఎస్‌పిని కలిసి వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన తాను తన భార్య లవకుమారి, కుమారుడు అఖిల్ మోటార్ సైకిల్‌పై అన్నవరం వెళుతుండగా చేబ్రోలు సమీపంలోని ఆదర్శ ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద వెనక నుంచి కారు తమను ఢీకొట్టిందని తెలిపారు. అదే కారు చేబ్రోలు గ్రామానికి చెందిన కోలా సత్తిబాబును ఢీ కొట్టగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడని వివరించారు. తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయిన తమను కొంతమంది అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారన్నారు. 2 రోజుల వరకూ తమకు స్పృహ రాలేదని చెప్పారు. 12 సంవత్సరాల కుమారుడికి శరీరమంతా గాయాలు కాగా, తన భార్యకు చెయ్యి విరిగిపోయన్నారు. ఆమె ముఖానికి శస్త్ర చికిత్స చేశారని వివరించారు. అయితే గొల్లప్రోలు ఎస్ఐ అప్పటి నుంచి కేసు నమోదు చేయలేదని తెలిపారు. తాము వెళ్లి అడిగితే మీకు గాయాలే కదా అయ్యాయి..మీ దిక్కున్నచోట చెప్పుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. తమను కించపర్చేలా దుర్భాషలాడారని ఎస్‌పికి వివరించారు. తక్షణమే ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై కేసు నమోదు చేసి, తమను బెదిరింపులకు పాల్పడుతున్న ఎస్ఐ బాలాజీపై చర్యలు తీసుకోవాలని ఎస్‌పికి విజ్ఞప్తి చేశారు.

ముగిసిన అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి


పాల్గొన్న కళాశాల అధ్యాపకులు తదితరులు

సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 5 రోజులపాటు జరిగిన అధ్యాపక అభివృద్ధి శిక్షణ సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు రోజులు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో 'డేటా హ్యాండ్లింగ్, ప్రీ-ప్రాసెసింగ్, ఎనాలిసిస్ మరియు విజువలైజేషన్ యూజింగ్ పైథాన్'ను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా నాగాలాండ్‌కు చెందిన ఎన్ఐటి సిఎస్ఇ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగరాజు, ఆదిత్య కాలేజీ సిఎస్ఇ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌విఎస్.లలిత డేటా సైన్స్, డేటా హ్యాండ్లింగ్, ట్రాన్స్‌ఫార్మర్ లెర్నింగ్ తదితర అంశాల వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ అకడెమిక్స్ డాక్టర్ పిఎస్‌వివిఎన్.రవికుమార్, హెచ్ఒడి డాక్టర్ సిహెచ్‌వివిఎస్ఎన్.మూర్తి, కన్వీనర్ డాక్టర్ ఎం.అనిల్‌కుమార్, కో ఆర్డినేటర్ జి.మౌనిక, వివిధ విభాగాలకు చెందినా అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు వైద్యం : జ్యోతుల

ప్రజాశక్తి - గండేపల్లి

సాయి హెల్త్‌కేర్‌లో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

కార్పొరేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు వైద్యం అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం మండలానికి చెందిన జెడ్ రాగంపేట జాతీయ రహదారిలో ఉన్న సాయి హెల్త్ కేర్‌లో ఆరోగ్యశ్రీ సేవలు అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జగ్గంపేట ప్రాంతంలో సాయి హాస్పిటల్ బ్రాంచి ప్రారంభించి వైద్య సేవలు అందిస్తున్న సాయి హాస్పిటల్ అధినేత విజయ్‌కుమార్‌ను ఆయన అభినందించారు. ఎంఎల్ఎగా మొట్టమొదటి ప్రారంభోత్సవం పేదలకు ఉచితంగా వైద్యం అందించే ఆరోగ్యశ్రీని ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీలో గైనకాలజీ, చిన్నపిల్లల విభాగం, జనరల్ సర్జరీ, ఇఎన్‌టి వంటి ముఖ్యమైన విభాగాలకు ఆరోగ్యశ్రీ వర్తించడం ఈ ప్రాంత ప్రజలకు శుభపరిణామని అన్నారు. ఎన్నికల హామీగా ఇచ్చిన కార్పొరేట్ హాస్పిటల్ నిర్మాణానికి విజయ్‌కుమార్ కూడా సహాయ సహకారాలు అందిస్తానని తెలపడం సంతోషకరమని అన్నారు. హాస్పిటల్ ఎండి విజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టుదల కార్యదీక్షతా గల వ్యక్తి ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అని, ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను చూస్తూనే తాము చదువుకున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, కొత్త బైరవకృష్ణ, కొత్త కొండబాబు, ముంద్రు ఎర్రబాబు, వేములకొండ జోగారావు, కందుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

'జనసేన' ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - గండేపల్లి

ఎన్‌డిఎ కూటమి విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని జగ్గంపేట నియోజకవర్గ జనసేన కార్యకర్తలు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం మండలంలోని మురారిలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలపాటు ఎన్నో కష్టాలు పడి, అవమానాలు దిగమింగుకుని పార్టీని కాపాడుకున్నామని అన్నారు. అందుకు ఫలితమే పోటీ చేసిన 21 స్థానాల్లో 21 మంది ఎంఎల్ఎలను, ఇద్దరు ఎంపీలను గెలిపించుకుని, కేంద్ర స్థాయిలో అధినేత పవన్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చామని అన్నారు. ఈ ఐదు సంవత్సరాలు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా సిఎం చంద్రబాబు నాయుడు ఐదు అంశాలపై తొలి సంతకం చేయడమే కాకుండా, కేబినేట్‌లో ఆమోదం తెలపడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం బాలు, బుదిరెడ్డి శ్రీనివాస్, వులిసి ఐరాజు, గోకేడ ప్రసాద్, మేక వీరబాబు, నల్లల శివ, దీపు, నరేష్, కుంచే కోటి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణు అవినీతిపై విజిలెన్స్ దర్యాప్తు

మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి రామచంద్రపురం

మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానంలో చేసిన అవినీతిపై విజిలెన్స్ దర్యాప్తు నిర్వహిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆయన ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానం వద్ద బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. దీనికి ప్రజలు హాజరై దేవస్థానం అధికారులు ముందు మంత్రి ఎదుట దేవస్థానంలో జరుగుతున్న అవినీతిని వివరించారు. స్వామివారి దేవస్థానంలో మాజీ ఎంఎల్ఎ తోట త్రిమూర్తులు అనుచరులు, మాజీ మంత్రి వేణు అనుచరులు పనిచేస్తూ స్వామివారి ఆదాయాన్ని దోచుకున్నారని పలువురు తెలిపారు. అదే విధంగా మాజీ మంత్రి వేణు ఇంట్లో ఏ కార్యక్రమం జరిగిన దేవస్థానం నుంచి చక్కెర పొంగలి, పులిహోర, బూర్లు, వంటవి వెళ్లేవని ఇక్కడ వంట చేసే బ్రాహ్మణుని అడిగి తెలుసుకున్నారు. అవన్నీ వాస్తవమేనని ఈ సందర్భంగా పురోహితులు తెలిపారు. అదేవిధంగా స్వామివారి పూజా కార్యక్రమాల పేర్లతో డ్రై ఫ్రూట్స్‌కు రూ.లక్షలు ఖర్చు పెట్టారని ఇదంతా ఎవరు మెప్పు కోసం చేశారని పలువురు ప్రశ్నించారు. కోటిపల్లిలో వరద బాధితులకు దేవస్థానం నుంచే మంత్రి ఆదేశాలతో భోజనాలు పంపించి ఆ ఖర్చులన్నీ దేవస్థానంలోనే రాశారని పలువురు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రథం నిర్మాణంలోనూ రూ.కోట్ల అవినీతి జరిగిందని, మాజీమంత్రి వేణు, మాజీ ఎంఎల్ఎ తోట త్రిమూర్తులు అనుచరులు రూ.వేలు జీతం తీసుకుంటూ ఇక్కడ తిష్ట వేశారని వారిని వెంటనే తొలగించాలని ఆలయ ఇఒ పి. తారకేశ్వరరావును ఆయన ఆదేశించారు. దేవస్థానం ప్రాంగణంలో మద్యం సీసాలు ఉండటం పైన మంత్రి మండిపడ్డారు. ద్రాక్షారామ భీమేశ్వర దేవస్థానం నుంచే కాకుండా మొత్తం రామచంద్రపురం నియోజకవర్గంలో ఎక్కడ అవినీతి ఉన్నా చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. దేవస్థానంలోని అమ్మవారి కి వచ్చే చీరలు వేలం వేయకపోవడం పైనా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలో పురోహితులు ఫ్యాక్షన్ రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. అదేవిధంగా విఐపిలో దర్శనం పేరుతో గంటలు గంటలు భక్తులకు అసౌకర్యం కలిగించవద్దని తాను వచ్చిన మామూలుగానే దర్శనం చేసుకుని వెళ్తానని ఈ సందర్భంగా ఆయన వివరించారు. దేవస్థానం గెస్ట్ హౌస్ లోనూ అవినీతి చోటు చేసుకుంటుందని వీటన్నిటి పైన విజిలెన్స్ దర్యాప్తు చేయిస్తానని మంత్రి ఇక్కడికి వచ్చిన భక్తులకు హామీ ఇచ్చారు. దీంతోపాటుగా డీజిల్ బిల్లులు, వాలంటీర్లుగా పని చేస్తూ దేవస్థానంలో ఉద్యోగాలు చేస్తున్న ఉద్యోగుల పైన, రథం నిర్మాణం పైన, దేవస్థానం షాపులు వద్ద వసూలు చేస్తున్న అక్రమాల పైనా, మాజీ మంత్రి ఆధ్వర్యంలో చేసిన ఖర్చులు పైన సప్త గోదావరి అభివద్ధి పనులపై జరిగిన అవినీతిపైన విచారణ జరపాలని గ్రామానికి చెందిన ఆళ్ల బుజ్జి మంత్రికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీటన్నిటి పైన చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు . ఇకనుండి దేవస్థానం ఇంచార్జిగా ఆళ్ల శివ లక్ష్మి నారాయణను నియమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు నామ వెంకన్నబాబు, ముప్పనపల్లి గణేష్, కర్రీ నాగు దంబాల భద్రరావు, అకేటి సురేష్, తోట రామకృష్ణ, రాఘవేంద్ర, అల్లం రామకష్ణ కర్ర నాగేశ్వరావు, ఆళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామం భీమేశ్వర స్వామి దేవస్థానం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ లో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

యానాం వార్తలు

రైతులకు మెగా చెక్కును అందిస్తున్న కృష్ణారావు

రైతులకు పంట ప్రోత్సాహక నగదు పంపిణీ

ప్రజాశక్తి - యానాం

2023 - 24 సంవత్సరానికి సంబంధించి వరి, కొబ్బరి ఇతర పంటలు పండించే రైతులకు పంట ప్రోత్సాహక నగదును పంపిణీ చేశారు. బుధవారం స్థానిక వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎఒ మునిస్వామి పాల్గొని 331 మంది రైతులకు 460 ఎకరాలకు సంబంధించి మొత్తం రూ.24,14,232 చెక్కు రూపంలో బ్యాంక్ ఖాతాలోకి జమ చేశారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ భీమ్ నగర్, ఫరం పేట, దరియాలతిప్ప సొసైటి భూములకు నీరు అందించడానికి యానాం లింకింగ్ ఛానల్ రెండో విడత పనులకు సంబంధించి నివేదికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దరియాలతిప్ప సొసైటీ భూములకు వరద రక్షణ గట్టు మరమ్మతు నిమిత్తం భారత ప్రభుత్వం ద్వారా నిపుణులు యానాం సందర్శించి, నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డిడి డాక్టర్ జె.శివ సుబ్రహ్మణియన్, చిక్కాల జోగిరాజు, కెవి.సుబ్బారావు, ఐకె ఖాన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక లేబర్ ఆఫీస్‌లో అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ అయ్యి 3 నెలలు గడుస్తున్న ఆ స్థానంలో వేరొక అధికారిని నియమించకపోవడం దారుణమన్నారు. కార్మిక హక్కులను గాలికి వదిలేస్తున్నారని ఆరోపించారు. సమస్యలను చెప్పుకోవడానికి అధికారి లేకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్అశోక్, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి స్పందించి తక్షణమే ఆ పోస్టులో అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం యానాంలో నిర్వహించారు. యానాం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ పరిపాలనాధికారి అధ్యక్షతన మాదకద్రవ్యాల వినియోగం పై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసులు హెల్మెట్లు ధరించి ప్రధాన రహదారుల్లో బైక్ ర్యాలీని నిర్వహించారు. అదేవిధంగా పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల చేత మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాజశేఖరన్, సిఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందం, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీస్

గుత్తుర్తి రాజు, S/o వెంకటరమణ, సాలిపేట, కాకినాడ వాస్తువ్యుడనైన నేను యావన్మంది ప్రజలకు తెలియజేయడమైనది ఏమనగా

ది. 19-6-2024వ తేదీ ఉదయం 10 గంటలకు మా ఇంటి వద్ద బయలుదేరి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేవాలయం వీధి బ్రాంచ్, కాకినాడకు బయలుదేరి డబ్బు విత్‌డ్రా చేసుకొనుటకు రెండు ఖాళీ చెక్కులు (చెక్కు నెంబర్లు 506390, 506391) తీసుకుని బ్యాంక్‌కి వెళ్ళి యున్నాను. బ్యాంక్‌కి వెళ్ళి చూసుకొనగా రెండు చెక్కులు కనిపించియుండలేదు. వెంటనే మా ఇంటి వద్ద నుండి బ్యాంక్ వరకు ఎంత వెతికిననూ కనిపించియుండలేదు. వెను వెంటనే బ్యాంక్ వారికి తెలియపరచియున్నాను. బ్యాంక్‌వారి ఆదేశానుసారం ఈ నోటీసుతో యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఎవరికైననూ దొరికిన యెడల నా ఫోన్ నెంబర్‌కు తెలియపరచవలసినదిగా కోరడమైనది.

ఇట్లు
గుత్తుర్తిరాజు,
S/o వెంకటరమణ, పైడావారివీధి, సాలిపేట,
కాకినాడ. సెల్: 8639377117

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
E.P. No.25/2023
in O.S.No.8/2002

Between:
చంద్రు శ్రీనివాసు ...DHr/వాది
మరియు
డా॥ బేతిన రవీంద్రనాథ్ & వగైరాలు ...JDrs/ప్రతివాదులు

To:
డా॥ బేతిన రవీంద్రనాథ్, S/o. వెంకట్రాజు, డాక్టర్, డో.నెం.16-1-20, కొత్తూరు, సామర్లకోట, తూ॥గో॥జిల్లా
...KJCJ - 1st JDr/1వ ప్రతివాది

పై నెంబరు EPలో 1వ JDr/ప్రతివాదికి శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపినను బుద్ధిపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున సదరు 1వ JDr శ్రీ కోర్టులో హాజరై ఆరోపణలు తెల్పుకోవడానికి ది. **05-07-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు వాయిదా అయి ఉన్నది. లేనిచో పై EPలో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

B.G.K. లా చాంబర్స్
బొగ్గవరపు గోకులకృష్ణ
అడ్వకేట్స్
డో.నెం.20-1-20, సుగుణ నిలయం
మెయిన్‌రోడ్, కాకినాడ
కాకినాడ
25-06-2024
సెల్: 7013694211

CHANGE OF NAME

I, KONDEPATI RAVINDRA BABU, S/o K Ramachandra Rao, R/o Green Meadows, H.No: 116-4-167/A, Plot: 27, Gadala, Rajahmundry-533102, E.G.Dist, Andhra Pradesh. I am having Passport Number **M3383116.** My spouse name is mistakenly entered as **KAVITHA KONDEPATI.** But my wife name is **KAVITHA DASARI.** I request the concerned passport authorities to consider this and correct my wife name as **KAVITHA DASARI.**

CHANGE OF NAME

I, KONDEPATI RAVINDRA BABU, S/o Kondepati Ramachandra Rao, R/o Green Meadows, H.No: 116-4-167/A, Plot-27, Gadala, Rajahmundry - 533102, E.G Dist, Andhra Pradesh. I am having **Passport Number - M3383116.** My father name is mistakenly entered as **KONDEPATI SRI RAMACHANDRA RAO.** But my father name is **KONDEPATI RAMACHANDRA RAO.** I request the concerned passport authorities to consider this and correct my father name as **KONDEPATI RAMACHANDRA RAO.**

దస్తావేజు పోయినది

కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం, సుంకరపాలెం, డోర్ నెం.1-78 రు కాపురస్తులు గుత్తుల వీర్రాజు (లేటు) గారు కుమారుడు గుత్తుల సుబ్రహ్మణ్యం గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా

నా ఆస్థికి సంబంధించిన ది.08-12-2011 కాకినాడ జిల్లా తాళ్ళరేవు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దాన సెటిల్‌మెంట్ దస్తావేజు 7363/2011, 7363/2011 డాక్యుమెంట్స్‌కి లింకు డాక్యుమెంటుగా ఉన్న 257/1971 రిజిష్టర్ అయినక్రియ దస్తావేజు ది.24-05-2024 తేదీన మా ఇంటి నుండి యానాం-కాకినాడ రోడ్డు పంచాయతీ ఆఫీస్ దగ్గరలో గల జెరాక్స్ షాపుకు తీసుకుని వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. 257/1971 నెం. గల డాక్యుమెంట్ కోసం కాకినాడ సబ్ రిజిష్టర్ ఆఫీస్‌కు వెళ్ళినాము, అక్కడ సబ్ రిజిష్టర్ గారు రికార్డు లన్ని చూసి లేవు అని చెప్పినారు. కాబట్టి 257/1971 డాక్యుమెంట్ రిజిష్టర్ కాబడిన క్రియ దస్తావేజు ఎవరికి అయిన దొరికిన యడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

గుత్తుల సుబ్రహ్మణ్యం
S/o. వీర్రాజు (లేటు), డోర్ నెం.1-78,
సుంకరపాలెం గ్రామం, తాళ్ళరేవు మండలం,
కాకినాడ జిల్లా. సెల్: 99515 09583